# ఎంతనేర్చినా....

రామ్మూర్తి సాహిత్యాభిలాషే కాదు రచయిత కూడ. కాలేజీలో నాకతను పరిచయమైన రోజే యీ విషయం తెలిసింది. నాకు సాహిత్యం గురించి యేమీ తెలీదు-తెల్సుకోవాలనే ఉత్సుకతా లేదు. కాని అనుకోకుండా రామ్మూర్తి పరిచయమవడం, మా మధ్య స్నేహం గట్టిపడటం నా ఆలోచనల్లో మార్పుకు కారణమయ్యాయి-నాకూ సాహిత్యంపై ఒక విధమైన అనురాగం యేర్పడింది.

మంచి సాహిత్యాన్ని చదివి జీర్ణించుకుని యే మసాళాలు లేకుండానే రచనలు చేసే వాడు రామ్మూర్తి అతని రచనలు చదవటం ద్వారానే నాకు సాహిత్యంలోకి ప్రవేశం కలిగింది మొదట్లో అతని రచనలు నాకు అర్థమయ్యేవి కావు ఆ విషయమే అతనితో అంటే ఆ రచనల వెనుక కథ, అతనెలా ప్రేరే పింపబడిందీ విడమర్చి చెప్పేవాడు. తర్వాత్తర్వాత అతని రచనలు అర్థ మయ్యేవి అడపాతడపా అతడు చదివే సాహిత్యంలోకి కూడ అడుగు పెట్టడం జరుగుతుండేది.

ఆ విధంగా నన్ను సాహిత్యంలోకి చొప్పించి, సాహిత్య మధువులో నన్ను ముంచిలేవనెత్తినవాడు రామ్మూర్తి. మూడేళ్ళ మా సాంగత్యం ఎన్నటికీ మాసిపోని స్నేహాన్ని రూపొందించిందనక తప్పదు.

రామ్మూర్తి సాహిత్యంలో కొన్ని ప్రయోగాలు చేశాడు. అతని రచనలు ఎప్పటికీ నాకుత్సాహాన్ని కలుగజేసేవి. అతని రచనలు చదివేక ఎక్కడవున్నా రామ్మూర్తికి ఉత్తరం రాయకుండా వుండలేక పోయేవాడిని.

రామ్మూర్తి నిగర్వేకాదు. బద్ధకస్తుడు కూడ. ఎటువంటి విమర్శ రాసినా తిరిగి జవాబు మాత్రం రాసేవాడు కాడు. నాకు మాత్రం ఒక విషయంలో బాధకలిగేది. రామ్మూర్తి మంచి రచనలు చేసే రచయితే అయినా పేరున్న రచయిత కాలేక పేయాడే అని. వంద మందిలో ఒక్కరు కూడ అతణ్ణి గుర్తుంచుకొనే వారు కారు.

ఉద్యోగరీత్యా ఎవరికి వాళ్ళం సెటిలయ్యాక పెళ్ళిళ్ళై సంసారాల్లో పడిపోయాక కొన్ని యేళ్ళు మేం వ్యక్తిగతంగా గాని ఉత్తరాల్లో గాని కల్సుకోలేదు —

ఓనాడు అకస్మాత్తుగా ఓ వారపత్రికలో కన్పించాడు. నేను వార పత్రికలు తిరగెయ్యటమేగాని చదివేదెప్పుడూ లేదు. కాని రామ్మూర్తి రాసిన కథ చూశాక అతణ్ని చూసినట్టే అన్పించి చదవకుండా వుండలేకపోయాను.

కానే ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే నేను చూసింది అప్పటి రామ్మూర్తిని కాదు, నాకంటే సాహిత్యపరంగా వందమెట్లు పై నుండే రామ్మూర్తి నా సరసనే నిలబడ్డట్లనిపించింది. అలా ఒకసారి కాదు— ఎన్నో సార్లనిపించింది. ఏ పత్రిక విప్పినా రామ్మూర్తి పేరే కన్పించేది. రామ్మూర్తి రచనలేని పత్రిక వుండేదికాదు.

ఇపుడు రామ్మూర్తి పేరు తెలీని వారు లేరు. అతని కథలు చదవని వారూ లేరు. అతనికింత పేరు వచ్చినా నాకానందమనిపించలేదు — అందుకే రామ్మూర్తిని కల్సుకుని మాట్లాడాలనుకున్నాను —మళ్ళీ పత్రికలను తిరగెయ్యటమేగాని చదవటం మానుకున్నాను,

అనుకోకుండా విశాఖపట్నం పనిమీద రావడంవల్ల పనిపూర్తి చేసుకుని రామ్మూర్తి యింటికి బయల్దేరి వెళ్ళాను. రామ్మూర్తి యింట్లోనే వున్నాడు. వాళ్ళమ్మాయి కాబోలు నన్ను పైకి తీసుకువెళ్ళింది— నేవెళ్ళేసరికి డాబామీద వాలుకుర్చీలో కూర్చున్నాడు. అతని చేతిలో కాగితాల దొంతర వుంది. నన్ను

చూడ్డంతోనే పెన్ను మూసివేశాడు చూసి చాలా రోజులయిందేమో మనిషి కాస్త మారినట్లు కన్పించాడు. కాస్త పొట్టకూడా వచ్చింది. పోషణలో శ్రద్ధ తీసుకున్నట్లు మనిషిని చూస్తేనే తెలిసింది.

డబ్బులేకపోయినా నిండుగా వుండే వాళ్ళెంతమంది లేరు? రామ్మూర్తి నిరుపేద కాకపోయినా డబ్బున్నవాడు మాత్రంకాడు. పెళ్ళికూడ ఒక రకంగా మార్పుకు కారణం కాగలదని సరిపెట్టు కున్నాను. నన్ను కూర్చోమని, వాళ్ళమ్మాయినికాబోలు కేకేసి యేదోచెప్పి నా కెదురుగా వచ్చి కూర్చున్నాడు

పలకరింపులియ్యాక, 'కథ గాబోలు రాస్తున్నావు, నేనడ్డొచ్చాను మధ్య' అన్నాను కావాలనే- రామ్మూర్తి యేం మాట్లాడలేదు. ఓ నవ్వు నవ్వి వూరుకున్నాడు— నేను మాత్రం వూరుకోదల్చుకోలేదు. "వర్ధమాన రచయితవిగా ఉత్తరం రాయడానికి కూడ తీరిక వున్నట్లులేదు— ఆ టైంలో మరోకథ రాసుకో వచ్చునుగా" అన్నాను కాస్త నిష్ఠూరంగానే-

"నాకు తెల్సు నువ్వు అమ్మల పొదితో వస్తావని" అన్నాడు రామ్మూర్తి నవ్వి.

నే నాశ్చర్యపోయాను.

"అయితే నేనడగబోయేదేమిటో నీకు తెల్సునన్నమాట?"

తల తాటించి నవ్వేడు

నా గొంతులో వెలక్కాయ పడింది.

రామ్మూర్తి కూతురు రెండు గ్లాసులతో నిమ్మరసం తీసుకొచ్చింది.

"ఇది మా మూడో అమ్మాయి. కవిత" అన్నాడు రామ్మూర్తి నిమ్మ రసం అందుకుంటూ

"మరి యీ వుద్యమం ఎప్పుడాపేవు?" అన్నాను నవ్వుతూ

"మరో యిద్దరు అబ్బాయిల తర్వాత" జవాబిచ్చాడు

కాస్సేపు పిల్లలూ, సంసారం. ఉద్యోగాలు మొదలైన విషయాలపైకి మళ్ళింది మా సంభాషణ ఆ తర్వాత కాలేజి విషయాలు, స్నేహం, మళ్ళీ సాహిత్యంలోకొచ్చాం.

"నాకు నీ పద్ధతేం నచ్చలేదోయ్ ఎందుకిలా దారి మార్చావ్" అన్నాను. సాహిత్యంలో అతడు ఓ పదిమెట్లు దిగిపోయాడన్న అయిష్టతతో.

నా మాటలు అర్ధమైనట్లున్నాయి.

"నీకు నచ్చదని నాకు తెలుసు. కానీ తప్పులేదు" అన్నాడు

"యేమిటి తప్పనిది? పేరు కోసమేగా దిగజారి అర్థంలేని రాతలు రాస్తున్నది" కసికొద్దీ అనేశాను. రామ్మూర్తేం కోపం తెచ్చుకోలేదు ఎటువంటి విమర్శకైనా నిలబడ గలిగే వ్యక్తి రామ్మూర్తి.

రెండు క్షణాలు ఆగి అన్నాడు "సాహిత్యం కడుపు నింపదు. కుటుంబ తాపత్రియాలు, సమస్యలు పెరిగినా పెంగని జీతంతో జీవితాన్ని ముడిపెట్టుకునే కంటె అందరికీ నచ్చేలా నాల్గురాళ్ళు వచ్చే విధానమే మంచి దనిపించింది సాహిత్యానికి సేవ చెయ్యటానికెంతో మంది వున్నారు మన లాంటి వాళ్ళు తగరని ఆలస్యంగా తెల్సుకున్నాను."

నా నోట మాట రాలేదు, నా మనసులోని ఎన్ని ప్రశ్నలకో ఒక్కసారి జవాబు చెప్పేడు రామ్మూర్తి.

నిజమే కొన్నికొన్ని మార్పులకు కారణం పరిస్థితులే—

[ జూన్ 5, 1977 - పత్రిజాతంత్ర ]